


# రామారావుతో ఇంటర్వ్యూ

చిత్ర

"ఆదీ సంగతి" అన్నాను వాసవితో పక్కనే నడుస్తూ

"నీ తలకాయలాగే వుంది నీ సిద్ధాతం కూడా" అంటూ నవ్వింది వాసవి నాకు కొంచెం కోపం వచ్చినమాట నిజం "నేనే తెలివిగలదాన్ననుకొని, అంత విర్రవీగటం మంచిది తాదు" అన్నాను ఎర్రగా తనవైపు చూసి మళ్ళీ నవ్వింది వాసవి "మీ కథలు రాసేవాళ్ళతో వచ్చిన చిక్కే యిది మీ కంతా అందంగానే, నిర్మలంగానే కనిపిస్తుంది. ఈ లోకంలోని కుళ్ళు, మనసుల్లో పేరుకుపోయిన మురికి మీ కంట పడదు అదే జరిగుంటే మనమింత వెనక బడి వుండేవాళ్ళం కాదు" అన్నది నాకు ఒళ్ళు మండిపోయింది "మీ స్కూల్లో ఎన్ని డిబేట్లలో పాల్గొన్నావేం?" అని అడిగాను

"నీతో తప్ప నే నెక్కడా పాల్గొనలేదు" అన్నది వాసవి నా వంక చూసి. నాకు దాని ప్రసంగంతో మరీ మండిపోయింది "నువ్వెన్నయినా చెప్పు, మంచి మనలోనే వుంటుంది మనం మంచిగా అనుకొంటే మంచిగానే వుంటారు, చెడుగా అనుకొంటే చెడుగానే వుంటారు నే

చెప్పిన సంగతి, చెబుతున్న సంగతి, ఎప్పటికీ చెప్పే సంగతీ కూడా అదే!" అన్నాను రెచ్చిపోయి

"కళ్ళు మూసుకు లోకమంతా చీకటిగా వుందనే వాళ్ళకి చెప్పేదేముంది?" అన్నది

"చెవులు, మెదడు కూడా మూసుకుపోయాయి నీకు, నేనేం చెబుతున్నదీ తలకెక్కడం లేదు" అన్నాను

ఇంతలో "కులాసానా!" అన్న పలకరింపుకి తల తిప్పాను రామారావు వస్తున్నాడు ఎదురుగుండా.

"ఇందాకట్నించీ చూస్తున్నాను మిమ్మల్ని, మీ చూపు మాత్రం ఇటులెదు" అన్నాడు దగ్గరగా వస్తూ

నవ్వాను అంతకంటే ఏం సమాధానం చెప్పాలో తోచలేదు ఆయన్ని చూడగానే నాకు వుత్సాహం కలిగినమాట నిజం

"ఈ మధ్య కనిపించడం మానేశారేం?" అని అడిగాను చివరికి

"ఆఫీసులో వర్క్ ఎక్కువగా వుంటోందండీ ఓవర్‌టైమ్ కూడా చెయ్యాల్సి వస్తోంది" అన్నాడు

నా పక్కన వాసవి వున్న విషయం అప్పుడు గుర్తొచ్చింది నాకు దిక్కుమాలిన మతిమరుపు, యిష్టమైన వారు కనిపించగానే పక్కనున్న వారిని మరచిపోతాం.

"ఈవిడ వాసవి నా ఫ్రెండ్" అని పరిచయం చేశాను "నమస్కారం" అన్నది వాసవి చేతులు కలపకుండానే "నమస్కారం" అన్నాడు రామారావు రెండు చేతులూ జోడించి చిరునవ్వుతో.

"ఈయన రామారావని నా ఫ్రెండ్. ఇక్కడే ఒక ప్రైవేట్ ఫరమ్‌లో ఉద్యోగం చేస్తున్నారు" అని వాసవికి రామారావుని పరిచయం చేశాను

"మీ పోస్టేవిటి?" అని అడిగింది రామారావుని వాసవి.

"ఎకౌంటెంట్" అన్నాడు కొద్దిగా కదిలి నుంచుంటూ

"రామారావు - బి కాం" అన్నాన్నేను. 'అలాగా' అన్నట్లు నవ్వింది వాసవి రామారావు మళ్ళీ కొంచెం కదిలాడు, తల పైకెత్తాడు, నవ్వాడు

"మీరేం చదువుతున్నారు?" అన్నాడు వాసవి నుద్దేశించి

"క్లాసు పుస్తకాలు తప్ప అన్నీను" అన్నది వాసవి రామారావు కొంచెం యిబ్బంది పడ్డట్లు కనిపించాడా సమాధానానికి దాని తలతిక్క సమాధానానికి నాకు కోపం కలిగింది

చేతిగడియారం చూసుకొని, "టైమవుతోంది వెళ్లొస్తానండీ ఇంకా ఇంటిదగ్గర చూసుకోవాల్సిన పనుంది" అన్నాడు నాతో.

"మీకు కాలేజి టైమవుతోందిగా!" అన్నాడు మళ్ళీ

ఇంటి కెళ్ళి భోంచేసి వెళ్ళిపోతాను, యిక ఆలస్యం లేదు నాకు" అన్నాను నా చేతిగడియారం చూసుకొంటూ

రామారావు వెళ్ళిపోయాడు. మేమూ ముందుకు కదిలాము మళ్ళీ మా సంభాషణకి వుపోద్ఘాతంగా నేను "చాలా మంచి వాడు" అన్నాను.

వాసవి బిగ్గరగా నవ్వింది నాకు చాలా కోప మొచ్చింది గట్టిగా దాన్నోరు నొక్కేద్దామనిపించింది అది వీధయిపో యింది. అది చిన్నసందు అప్పు డెవరూ సందులో మనుషులు లేకపోబట్టి సరిపో యింది కాని, లేకపోతే నా పక్కన నడు స్తున్న అది, అలా పిగ్గరగా నవ్వడం దారేపోయేవాళ్లందరూ మా వంక చూడటం నా తల భూమిలోకి వంగిపోయేది కాదూ!

"ఏమిటి రావణాసురుడిలా ఆ వికటాట్ట హాసం?" అని నా కోపాన్ని మాటల్లో పెట్టాను

"రావణాసురుడు మంచివాడేనా?" అన్నది నివ్వాపుకొంటూ జిడ్డు. ఏ విషయా న్నయినా జిడ్డల్లే పట్టుకొంటుంది.

"నీ కసలు లోకంలో ఎవరన్నా మంచి వాళ్ళున్నారేమో చెప్పు"అని ఎదురు ప్రశ్న వేశాను

"నువ్వు మంచిదానివి కాదూ!" అన్న దది 'మంచిదానివి కావూ!' నాకు చిరచిర లాడిపోయిందా ప్రసంగం వకవకా నడ వడం మొదలు పెట్టాను.

"ఇంతకీ ఆ రామారావు మంచివా డంటావు అంతేనా?" అన్నది నా బుజం మీద చెయ్యివేసి ఆ గొంతులోని వ్యంగ్య మంతా ఏమయిపోయిందో అంతలో చాలా సౌమ్యంగా మారిపోయింది

"ఖచ్చితంగా నూటికి నూరుపాళ్లు మంచివాడూ, మంచివాడూ అంటాను" అన్నాను నొక్కిపలుకుతూ. నా కసినంతా నొక్కి పలకడంలోనే తీర్చుకొన్నాను.

"వాళ్ళిల్లు నీకు తెలుసా?" అని అడిగింది.

ఎందుకు అని అడిగాను నొసలు చిట్లించి దాని ప్రశ్న నా కాశ్చర్యం కలి గించింది, బయటపడ లేదు నేను

"వెళ్దాం ఒకసారి" అన్నది

"తెలుసు" అన్నాను.

"అయితే సాయంత్రం వెడదామా?" అని అడిగింది

"వెడదాం" అన్నాను మామూలుగా పైకి నాకు చాలా వుత్సాహాన్ని కల్గిం చిందా ప్రసంగం అది నాకు ప్రాణ స్నేహితురాలైనా, మాటల్లో నాకు ప్రత్యర్థి. ఇన్నాళ్ళకయినా నా ప్రత్యర్థిని పడగొట్ట గలుగుతున్నందుకు కలిగిన ఉత్సాహమది.

నే తెచ్చుకొన్న లైబ్రరీ బుక్స్ దాని కిస్తూ, "సాయంత్రం కాఫీకి యిక్కడికే రావాలి" అన్నాను

"అలాగే. తప్పకుండా వెడుతున్నా సాయంత్రం వస్తా"అంటూ వెళ్ళిపోయింది వాసవి

నేను సాయంత్రం కాలేజి నుంచి వచ్చిన ఐదు నిముషాలకల్లా వాసవి వచ్చే సింది దాని పంక్చుయాలిటీ అంతే అసలు.

కాఫీ కానిచ్చి, ఇద్దరం రామారావు ఇంటికి బయల్దేరాము మా వీధి చివరిలోనే వుంది వాళ్ళిల్లు

"నువ్వేమో అనుకుంటున్నావు కాని, రామారావు చాలా మంచివాడు" అని మళ్ళీ ప్రసంగం మొదలుపెట్టాను

"ఎలా చెప్పగలవా మాట?" అని అడిగింది.

"నాకు పాఠాలు నేర్పేది నువ్వే కదా, అలా అడుగుతావేం?" అన్నాను.

"అది సర్లేగాని, ఎలా చెప్పగలవా మాట?" మళ్ళీ రెట్టించింది. చెప్పాగా జిడ్డని.

"సావిత్రి అమాయకురాలని ఆ కళ్ళ వంక చూసి ఎలా చెప్పగలిగావ్?" అని ఎదురు ప్రశ్న వేశాను.

సన్నగా నవ్వింది. నిత్యానందం— ఎప్పుడూ నవ్వుతూనే వుంటుంది.

"ఆడవాళ్ళని ఒక్క కళ్ళని బట్టి చది వెయ్యొచ్చు! మగవాళ్ళని అలాకాదు. నడక, నుంచోడం, కదలిక, మాటతీరు ప్రతి దాంట్లోనూ చదవాల్సి వుంటుంది" అన్నది జారిపోతున్న పైటను పైకి సర్దుకొంటూ.

"నువ్విక్కడితో చదువాపి, మా బోటి వాళ్ళందరికీ మహోపకారం చేశావు. నువ్వింకా చదివుంటే మేమంతా చచ్చుండే వాళ్ళం" అన్నాను.

"నిజాన్ని భరించలేని బలహీనతని వదులుకోలేనన్ని నాళ్ళూ, నిజాలు మనకి పరమ కఠోరంగా, భరించలేనివిగానే వుంటాయి" అన్నది మళ్ళీ నవ్వుతూ.

"పెళ్ళయిందనుకొంటాను" అన్నది మళ్ళీ.

"ఒక పాప కూడా" అన్నాను.

"ఆడపిల్లేనా?" అన్నది నవ్వుతూ.

"ఆరో నెల. చాలా బావుంటుంది" అన్నాను సమాధానంగా.

"ఈ ప్రపంచంలోని మురికేదీ అంటని వాళ్ళ మనసే వాళ్ళని అందంగా కన బరుస్తూ వుంటుంది" అన్నది.

"అలా వేదాంతం మాట్లాడకు" అన్నాను చిరుకోపంతో.

"వేదాంతం మాట్లాడానని నువ్వన్నా కాని, నా మాటలు నీకు అర్థం కాలేద, నాకు తెలీలేదు" అన్నది. ఒక మాటకి నాలుగర్థాలు, ఒక మనిషికి నాల్గురకాల వ్యాఖ్యలు చెప్పగల వాసవి ఆ మాటలన్న దంటే ఎలా నమ్మను?

ఇంతలో రామారావు ఇంటి దగ్గరక వచ్చాము. వాకిలి తలుపు దగ్గరగా వేసి వుంది. తోసి లోపల అడుగు పెట్టాను పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదువు తున్నాడు రామారావు.


నన్ను చూసి సంభ్రమంగా లేచి, "రండి, రండి లోపలికి. చాలా విశేషమే వుందివాళ" అన్నాడు.

ఇంతలో నా వెనకున్న వాసవిని చూసి, "మీ ఫ్రెండ్ కూడా వచ్చారే. రండి లోప లకు. కూర్చోండి" అన్నాడు.

"సొంతం లోపలకు రాందే ఎలా కూర్చోమండి?" అన్నది వాసవి నవ్వుతూ. అతితెలివి కాదూ!

రామారావు కొంచెం సిగ్గుగా, ఇబ్బం దిగా నవ్వాడనిపించింది నాకు. అలాంటి ప్రసంగాలు చేస్తేనే నాకు వాసవంటె కోపం వచ్చేది.

ఇంతలో భార్యని పిలచి, "చాపిలా వెయ్యి. వీళ్లు వచ్చారు" అన్నాడు.




"దానికి చేస్తున్న పని చెరచుకు ఆవిడ రావడ మెందుకండీ!" అంటూ వాసవి మూలనున్న చాప తీసి తనే పరచి, ఒక పక్కన కూర్చుంది. అంతవరకూ సంతో షించాను, "చాపెందుకండి!" అని కుర్చీలో కూర్చో లేదు.

ఇంతలో వాళ్ళావిడ వచ్చింది, చేతులు చీరకొంగుకి తుడుచుకొంటూ. నా వైపు చూసి నవ్వుతూ, "నీ ఫ్రెండ్ వచ్చారు." అన్నాడు వాళ్ళావిడతో. నేనూ నవ్వాను. వాసవి కూడా నవ్వింది. నా కర్థమై పో యి ం ది, రామారావు ప్రసంగానికే నవ్విందని.

"ఈ మధ్య బొత్తిగా కలుసుకోడానికి పడటం లేదు." అన్నాను.

"మరే, ఈ మధ్య మీరు బొత్తిగా కనిపించడం లేదు" అన్నదావిడ. ఆవిడ పేరు శకుంతల. వాసవి వైపు చూసింది ఆ మాటని.

"నా స్నేహితురాలు, వాసవి" అన్నాను.

"ఇద్దరూ ఒకే క్లాసా?" అన్నది శకుంతల. ఫక్కుమన్నది వాసవి. ఆవిడ అర్థం కానట్లు చూసింది. నాకు యిబ్బం దనిపించింది.

"లేదండీ, తను హైయ్యర్ సెకండరీ తోనే ఆపేసింది" అన్నాను.

'అలాగా' అన్నట్లు చూసి, "కుంపటి మీద కూర పడేసి వచ్చాను. చూసొస్తా" నని లోపలకు వెళ్ళింది.

"ఏవిటండీ కాలేజీ విశేషాలు?" అని అడిగాడు రామారావు పాదం నేల మీద కొడుతూ.

"ఎప్పుడూ కొత్తవేం వొస్తాయి లెండి!" అంటూ నవ్వాను

"మీ ఆఫీసు విశేషా లేవిటి?" అని అడిగాను నేను.

"ఏం వున్నాయి లెండి, మా హెడ్డు మారాడు కొత్తతను అందర్నీ నానా అవస్థ పెట్టేస్తున్నాడు లెండి" అన్నాడు.

"అందర్నీ సమంగా చూస్తున్నాడంటే మంచివాడేనన్నమాట" అంటూ నవ్వింది వాసవి నాకు నవనాడులూ కుంగిపోయినట్లనిపించింది ప్రసంగం మొదలుపెట్టగానే తెలుస్తుంది, జిడ్డులోకి లాగుతుందని

"ఆడపిల్లల్ని మటుకు " అంటూ నవ్వి ఆపేశాడు

"ఆపేశారేం?"అని రెట్టించింది వాసవి

"ఏం వుందీ, వాళ్ళెలా చేసినా బాగానే వుంటుంది!" అన్నాడు కొద్దిగా కదులుతూ

"అంటే, వాళ్ళ వర్క్ పెండింగ్‌లో పెడతారా?" అని అడిగింది

"పెండింగ్‌లో పెడితే వూరుకోడు లెండి" అని "అయినా ఆడపిల్లలకి వుద్యోగాలు దేనికి?" అన్నాడు నవ్వుతూ. నన్ను సన్నగా మోచేత్తో పొడిచింది వాసవి

"మగవాళ్ళు ఎందుకు చేస్తున్నారు?" అని అడిగింది సూటిగా ఆ వాగ్ధోరణి ఇక ఆగదు.

రామారావు నవ్వాడు 'ఇదేం తెలివితక్కువ ప్రశ్న' అన్నట్లు. "సంపాదించి తన వాళ్ళను పోషించుకోవాల్సిన అవసరం వుంటుంది కాబట్టి" అన్నాడు.

"అలాంటి ఆర్థికావసరమే ఆడపిల్లకెందు కుండకూడదు? అంటే ఎందరో ఆడపిల్లలు ఆర్థికావసరంతోనే ఉద్యోగాలు చేస్తున్నా రంటాను" అన్నది వాసవి.

చెయ్యి ఒకసారి గాలిలోకి విదిలించాడు రామారావు, "మీ రెన్నయినా చెప్పండి, డబ్బుతో మొగాడి కున్నంత అవసరం ఆడదానికి వుండదు" అని "వీళ్ళు కేవలం సంపాదన కోసం ఆఫీసులకి వస్తున్నారంటారా?" అంటూ అర్థోక్తిగా నవ్వాడు.

వాసవి ఎదురు సమాధానం చెప్పబోయేంతలో, వాళ్ల గడప ముందునుంచి ఒక అమ్మాయి తొందరగా వెళ్ళిపోయింది.

"ఆవి దెవరు?" అని అడిగింది వాసవి నన్నుద్దేశించి

వెంటనే రామారావు "పక్కింటి వాళ్ళమ్మాయి" అని సమాధాన మిచ్చాడు

"ఏం చేస్తోంది?" అని అడిగింది సాలోచనగా

"ఏం చేస్తుంది- పాతి కేళ్లొచ్చి ఇంకా పెళ్ళి కాకుండా ఇంట్లో కూర్చుంది" అన్నాడు

గతుక్కుమన్నాను నేను ఇన్నాళ్ల మా పరిచయంలోనూ ఎప్పుడూ అలాంటి ప్రసంగం చేయలేదు సందర్భం కూడా యిలాంటిది రాలేదు. ఏవో మా కాలేజీ విషయాలు, తన ఆఫీసు విషయాలు, సినిమాలు, వాళ్ల పాప అల్లరి వీటి మీదే నడిచేది మా సంభాషణ.

కళ్లతోనే నన్ను అవతలికి వెళ్ళమని సైగ చేసింది వాసవి యంత్రంలా నడిచాను వంటింట్లో వున్న శకుంతల దగ్గరకు

"కూర్చోండి, నేనే పిలుద్దా మనుకొంటున్నాను" అన్నది శకుంతల నన్ను చూసి చాకు కుంపటి మీద కెక్కించే సన్నాహంలో వుంది హాలుకి వంటింటికి మధ్య గుమ్మంలో కూర్చున్నాను అవతల వాళ్ల మాటలు కూడా వినాలి మరి! వాళ్ళ పాప వంటింట్లోనే ఒక పక్క లక్కపిట్లతో ఆడుకొంటోంది

"మీకు అక్క చెల్లెళ్లు లేరా?" అని అడుగుతోంది వాసవి

"మీ కెలా తెలుసు?"—అంటున్నాడు రామారావు.

"అలా అనిపించింది" అన్నది వాసవి.

"మీ చిన్నన్నయ్య చదువు ఈ సంవత్సరంతో పూర్తవుతుందా?" అని అడిగింది శకుంతల

"అవుతుంది" అన్నాను తలూపుతూ.

"తరువాత పెళ్ళిప్రయత్నమా? ఉద్యోగ ప్రయత్నమా?" అడిగింది నవ్వుతూ

"అవతల, నాకు ఇద్దరక్కలు ఒక అక్కకు పెళ్లయింది" అంటోంది వాసవి.

"మీ కంటే పెద్ద పిల్లలు వాళ్ళిద్దరేనా?" అని అడుగుతున్నాడు రామారావు.

అవు నన్నది వాసవి

"మీరేం మాట్లాడటం లేదు" అన్నది శకుంతల

"మాట్లాడటం లేదంటా రేవిఁటి, మాట్లాడుతూనే వున్నాగా!" అన్నాను నవ్వుతూ

"భలే గడుసువారే! మాట్లాడిస్తే మాట్లాడుతూ; మాట్లాడటమంటే?" అన్నదావిడ.

"మీ దగ్గిర నేర్చుకోవాలది" అన్నాను నవ్వుతూ.

"మీ తరువాత ఇంకా సిస్టర్స్ గాని బ్రదర్స్‌గాని వున్నారా?" అడుగుతున్నాడు రామారావు.

"ఇద్దరు తమ్ముళ్లున్నారు-చదువుకొంటున్నారు" అన్నది వాసవి.

"మీ చిన్నక్కేం చేస్తుంటారు?"


"ఎమ్మే చదువుతోంది" అన్నది

"అంటే లెక్చరర్ అవుతారన్నమాట!" అన్నాడు పెద్దగా నవ్వుతూ.

"తప్పకుండా" అన్నది వాసవి.

నేనేం మాట్లాడటం లేదని గుర్తొచ్చింది అది మామూలు నా స్వభావానికి విరుద్ధం అందుకని "మీ పాప పేరేమిటి చెప్పా రూ— అపరాజిత కదూ, చాలా బావుంది— పాపలాగానే పేరు కూడా" అన్నాను ఆడుకొంటున్న పాపను దగ్గరకు తీసుకొంటూ. పాపకు కొత్తలేదు కాబట్టి గొడవ చేయకుండా వచ్చేసింది

"వాళ్ళమ్మాయిని కాన్వెంటులో చదివిస్తారుట ఈ పాతకాలపు వాసన లేవీ వాళ్ళమ్మాయి దగ్గరకు రాకూడదట. ఆధునికంగా పెంచుతారట. అందుకు నాందీట-



అపరాజిత పేరు పుట్టిన తిథిని బట్టి బ్రాహ్మణుడు 'అ' మీద రావాలన్నాడు పేరు. నేను 'అనసూయ' పెడదామన్నాను. 'త్రిమూర్తులేం దిగి రారులే నీ కూతుర్ని పరీక్షించటానికి' అంటూ నవ్వుతో కొట్టి పారేశారు నా మాటని. మురిసిపోతూ చెబుతోంది శకుంతల నేను తన మాట వింటున్నానా, లేదా అన్న ధ్యాస లేకుండా చెబుతోంది.

"మీరు వదు వెందుకని ఆపేశారు?" ఆసక్తిగా ప్రశ్నిస్తున్నాడు రామారావు

"ఎవరిష్టం వాళ్ళది కదండీ!" పుట్టుకతో వచ్చిన తలబిరుసు మరి

"అంటే చదవడం యిష్టంలేకనా?" రామారావు ఆత్రం చూస్తే జాలేసింది నాకు.

"అంతేలెండి నా టైమ్ వేస్ట్ చేసుకోడం యిష్టంలేక అన్నదది" తెల్లబోయి నట్లు అన్నాడు రామారావు

"కొత్తగా మాట్లాడారు అది టైమ్ వేస్ట్ చేసుకోడం ఎలా అవుతుందండీ?" అని

"ఆ కాలేజి పుస్తకాల్లో వుండే నాలుగు ముక్కలు రాకపోతాయా?" నవ్వింది

"దాన్నొదిలి పెట్టి ఒక్కక్షణం వుండ-లేదు నిద్ర లేవగానే దాని ముఖం చూడాల్సిందే! రాత్రికి ఆయన పొట్ట మీద నిద్ర పోవాల్సిందే! ఆడపిల్ల వుంటే ఇంట్లో మహానందటిట" అంటూ ఆగింది, శకుంతల కుంపటి మీద చారెక్కించడానికి

"మీరు సెవెంత్ ఫామ్ పాసయి ఎన్నేళ్లయింది?" అడుగుతున్నాడు రామారావు

"చాలా ఏళ్ళే అయింది" అన్నది వాసవి

"అంటే, నాలుగైదేళ్లయిందా?" అడిగాడు

"అయుండొచ్చు! నేను పరీక్షకు వెళ్ళిన సంవత్సరం " ఆలోచిస్తున్నట్లుంది, వాసవి

"మీ వయస్సెంత?" పక్కలో బాంబు పేలినట్లనిపించింది నాకు రామారావు యిలాంటి ప్రశ్న అడుగుతాడని నేను కలలో కూడా అనుకోలేదు, అందులో వాసవిని

రెండు సెకన్లు ఆగి అన్నది వాసవి

"ఇదే ప్రశ్న మీ భార్యని ఓ యువకుడు అడిగితే మీరు హర్షించగలరా?" అని.

"అందులో తప్పేముంది? మీకు కోపమొచ్చినట్లుంది." తడబడ్డాడు రామారావు తడబాటులోనే నవ్వినట్లనిపించింది

"కోప మెందుకు. ఇష్టం లేకపోతే సమాధానం చెప్పడం మానేస్తే సరిపోతుంది తప్పు సంగతి ఎవరికి వాళ్ళు తెలుసుకోవాలి" అని "పుట్టినరోజు పండుగలు చేసుకోను నిత్యం ఎన్నో వ్యాపకాలుంటాయి వాటి మధ్యలో పడి నలిగిపోతూంటానే తప్ప, నా వయసెంతని నేనింతవరకూ ఎప్పుడూ అంచనా వేసుకోలేదు" అన్నది వాసవి

"అరెరె! పాప మీ చీర తడిపేస్తోంది చూసుకోడం లేదు. ఏదో పరాకులో పడ్డారు" అంటూ శకుంతల పరుగులాంటి నడకతో వచ్చి, పాపను దొడ్లోకి తీసుకు వెళ్ళింది. నిజంగానే నా చీర కుచ్చెళ్ల కింది భాగం తడిసిపోయాయి. కాని నే నక్కడ నుంచి కదల్లేదు.

"త్వరలోనే మాకు పప్పన్న మేమో. మీ చిన్నక్క పెళ్ళి చేయరూ?" ఒక నిమిష మాగి అన్నాడు రామారావు.

"మా చిన్నక్క యిప్పుడు పెళ్ళికోసం కలవరించడం లేదు" అన్నది వాసవి

"భలేవారే? పెళ్ళికోసం కలవరిస్తేగాని ఆడపిల్లలకు పెళ్ళి చేయరా ఏవిటి?" నవ్వాడు రామారావు

"ఆ సంగతేమో కాని, బలవంతపు పెళ్ళి మటుకు చెయ్యరు"

"ఎన్నాళ్ళలా వుంటారు?"

"మీరిలా అడుగుతారని తెలిస్తే కనుక్కొనుండే దాన్ని" నవ్వుతూనే ఆ మాట వదిలిందని తెలుసు.


ఎంతిష్టం లేకపోతే మటుకు అలాంటి సమాధానమా చెప్పేది?

"మీకు మాట్లాడటం సమంగా చేతకాదనుకొంటాను" గొణుక్కొంటున్నట్లుగా అన్నాడు రామారావు

"నిజాన్ని భరించడం కష్టమనండి" వాసవి గొంతు ఇక నేను రంగంలోకి దిగక తప్పదనిపించింది

"ఏవో వాదించుకొంటున్నట్లున్నారు?" అన్నాను యివతలికి వస్తూ.

"చెబుతున్నారుగా మీ ఫ్రెండ్ నిజాన్ని భరించడం కష్టం అని" నవ్వాడు




"స్త్రీ నోట్లోంచి వచ్చే నిజాన్ని భరించడం మరింత కష్టం" అన్నది వాసవి తనూ నవ్వుతూ

"నీకేం ఎంతసేపయినా కబుర్లు చెబుతూ కూర్చుంటావు కాని, నాకు చదువుకోవాల్సిన వున్నా యవతల పోదాంపద" అన్నాన్నేను.

"మా ఆవిడ ఏం తోచటం లేదనుకుంటోంది, మీ దగ్గర ఏవైనా చదువుకొనేందుకు బుక్స్ వున్నాయా?" నన్నుద్దేశించి అడిగాడు అంతలోనే అందుకొంది వాసవి "నా దగ్గర 'చలం' రచనలు వున్నాయి కావాలా?" అన్నది నవ్వుతూ. దాని దగ్గర లైబ్రరీబుక్స్ తప్ప వేరే వుండవని నాకు తెలుసు

"యువతీ, యువకుల్ని ఎంత నాశనం చెయ్యాలో అంతా చేసి, పోయి ఆ ఆశ్రమంలో దాక్కున్నాడు కాదూ!" అన్నాడు రామారావు

"చలం నాశనం చేశాడూ అంటే, చలం అసలేం చెప్పింది వదిలేస్తే మనకు కనిపించే దంతే!" అన్న దది

"ఏవిటండీ చలం అసలు చెప్పింది?" వ్యంగ్యంగానూ, కొంచెం కోపంగానూ ధ్వనించింది రామారావు గొంతు

"మూత తీసి చూపించాదని కుటుంబరావు చెప్పలేదూ!"

"రెండూ రెండే!" తుంచేసి నట్లన్నాడు రామారావు

"ఇంతకీ చదువుతారేమో ఆవిడ్ని కనుక్కోండి" అన్నది వాసవి. నవ్వు దాచుకొంటున్న ట్లనిపించింది.

"కనుక్కోనవసరం లేదులెండి, ఆవిడది వేరే మాటకాదు" అన్నాడు.

"పోదాం పద" అంటూ కదిలింది వాసవి. "వెడుతున్నామండీ!" అన్నది రామారావుతో.

"మా పాపని చూసి వెళ్ళరూ!" వాసవి నుద్దేశించి అని, లోపలకు వెళ్ళి పాపను తీసుకొచ్చాడు రామారావు. దిగంబరంగా వుంది పాప. వాసవి చేతులు చాచగానే మీద కురికింది.

"పేరు అపరాజితట కదూ!" పాప బుగ్గ ముద్దు పెట్టుకొంటూ అన్నది వాసవి.

రామారావు నవ్వాడు. కళ్ళలో ఒక మెరుపు కనిపించింది. ఆ మెరుపులో గర్వం తొంగిచూసింది. ఇంతలో శకుంతల వచ్చింది. వెడుతున్నామని శకుంతలతో కూడా చెప్పాము. కాఫీ తాగి వెడుదురు అన్నది. వద్దన్నాము. రామారావు కూడా ఆగమన్నాడు."మా ఇంట్లో తాగకూడదా?" అన్నాడు వాసవి వద్దన్నప్పుడు.

"అదేం లేదండి. ఇంతకుముందే తాగొచ్చాము" అన్నాను నేను వెంటనే కల్పించుకొని. నాకూ యిక అక్కడ వుండ బుద్ధి కాలేదు. ఇద్దరమూ యివతలకు వచ్చేశాము, మళ్ళీ ఒకసారి వెడుతున్నామని చెబుతూ.

నాకేం మాట్లాడాలో తోచింది కాదు అంతలో వాసవే అంది నవ్వుతూ "చూశావా విశ్వరూపం?" అని.

"అంతసూటిగా మాట్లాడేశావు. ఏమనుకోడూ?" అన్నాన్నేను పక్కనే నడుస్తూ.

"లేనిదేం మాట్లాడలేదుకదా!" అన్నది.

"స్త్రీ అంటే చులకనభావం అంటావు" అన్నాను, దాని సమాధానం కోసం.

"నీ తలకాయ. నే ననే దేమిటి, నీకు తెలీలేదూ?" అంటూ నవ్వింది. "ఇలాంటి మనుషులే,వాళ్ళు మానసికంగా బురదలోపడి దొర్లుతుంటారు పందుల్లాగా. తమేదో మహా సింహాసనం మీద కూర్చున్నామనీ, అది దిగి రానవసరం లేదనీ అనుకొంటూంటారు" అన్నది.

"అనుకోనీ. మనజోలికి రానన్నాళ్ళూ మనకి బాధలేదు" అన్నాను.

"మహాసింహాసనం మీద కూర్చున్నామని అనుకొనేవాడు దిగి మనజోలికి రాడు.అందులోనూ ముగ్గురన్నల ముద్దుల చెల్లెలివి నువ్వు, నా సంగతి తెలిపిందికదా!"అంటూ నవ్వింది. "మనబోటి వాళ్ళజోలికి అసలే రాడు. ఏదో మానసికంగా అనుకొని, యింకా తనివి తీరనప్పుడు నోటితో అని ఆనందిస్తూంటాడు. ఎప్పుడైనా- అవకాశం దొరికితే —— ఎటువంటి పరిస్థితుల్లోనూ మూడోవ్యక్తికి తెలీ దనుకొన్నప్పుడు కొంచెం సాహసిస్తాడు- అంతే." అన్నది నవ్వుతూ.

ఇంతలో మా ఇల్లు వచ్చేసింది. నే లోపలకు వెళ్ళిపోయాను. అది వెళ్ళిపోయింది.